www.prajasakti.com
ప్రజాశక్తి
బుధవారం 10 జులై 2024
5
డాక్టర్ బిఆర్.అంబేద్కర్ కోనసీమ



పశుగ్రాసంపై రైతులకు అవగాహన


పాల్గొన్న పశువైద్యాధికారి, రైతులు

ప్రజాశక్తి-రామచంద్రపురం
పశుగ్రాసంపై రైతులకు అవగాహనా సదస్సు మండలంలో వెలంపాలెం గ్రామంలో మండల పశు వైద్యాధికారి ఎం.కృష్ణమూర్తి ఆధ్వర్యం లో మంగళవారం నిర్వహించారు. పశుగ్రాస వారోత్సవాల్లో భాగంగా ఈ నెల 14 వరకు వీటిని నిర్వహిస్తున్నామని ఆయన వివరించారు. నాణ్యమైన పశుగ్రాసం వల్ల రైతులకు దాణా ఖర్చు తగ్గుతుందని, పాల ఉత్పత్తి పెరుగుతుందని తెలియ చేశారు. పశుగ్రాసం విత్తనాలు 75 శాతం సబ్సిడీపై ప్రభుత్వం అందిస్తున్నదని ఆయన వివరించారు. కార్యక్రమంలో రైతులు కృష్ణ మూర్తి, ధనరాజు, సన్యాసిరావు తదితరులు పాల్గొన్నారు.

అధ్వానంగా జగనన్న కాలనీలు

▸ రోడ్లు, డ్రైన్లు, తాగునీరు లేక ఇక్కట్లు

ప్రజాశక్తి-రామచంద్రపురం
ఎంతో అట్టహాసంగా గత ప్రభుత్వం జగనన్న కాలనీల పేరుతో ప్రారంభించిన పేదల ఇళ్ల వద్ద కనీస వసతులు లేక కాలనీ వాసులు అనేక అవస్థలు పడుతున్నారు. కె.గంగవరం మండలంలోని పలు గ్రామాల్లో ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు రోడ్లు లేక డ్రైనేజీ లేక, తాగునీరు, విద్యుత్ సౌకర్యం కనీస వసతులు కరువై ప్రజలు ఎన్నో ఇబ్బందులు పడుతున్నారు. ఈ నేపథ్యంలో రామచంద్రపురం మండలం లోని జగన్నాయకులపాలెంలోని అధ్వాన్నంగా ఉన్న వైఎస్ఆర్ కాలనీని ఈ నెల 7న రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ వారిని పరిశీలించారు. ఈ సందర్భంగా కాలనీ వాసులతో ఆయన మాట్లాడారు.

కాంట్రాక్టర్లకు బిల్లులు అవక జాప్యం

జగనన్న కాలనీల్లో రోడ్లు, డ్రెయిన్లు కనీస సౌకర్యాలు కల్పించేందుకు గత ప్రభుత్వం పంచాయతీరాజ్ శాఖకు అప్పగించింది. వీటిని నిర్మించిన కాంట్రాక్టర్లకు సకాలంలో బిల్లులు రాలేదు. దీంతో రోడ్లు పూర్తి కాలేదు. ప్రస్తుత ప్రభుత్వం సూచించిన విధంగా పనులు చేపడతాము. నియోజకవర్గంలో సుమారు 50 శాతం వరకూ పనులు పూర్తి చేశాము. - మల్లిఖార్జునరావు, హౌసింగ్ డిఇ


ఇటీవల జగనన్న కాలనీ రోడ్లు పరిశీలించిన మంత్రి సుభాష్


జగన్నాయకులపాలెంలో రోడ్ల దుస్థితి

రోడ్లు అధ్వాన్నంగా ఉండాన్ని చూసి ఆయన స్పందించారు. వారం రోజుల్లో గ్రావెల్ రోడ్లుకు గ్రాంట్ వచ్చేలా చూసి రోడ్లు వేయిస్తానని, లేనిచో తన సొంత ఖర్చులతో రోడ్లు వేయిస్తానని హామీ ఇచ్చారు. ఒక్క జగన్నాయకులపాలెం గ్రామమే కాక ఆదివారపుపేట, వెల్ల సావరం, తోటపేట, వెలంపాలెం, యర్రపోతవరం, దంగేరు, తామరపల్లి, కోటిపల్లి వంటి అనేక గ్రామాల్లో రోడ్లు పూర్తి కాలేదు. దీంతో వర్షాలు కురిస్తే కాలనీల్లోకి వెళ్లే అవకాశం లేదు. డ్రైన్లు లేక పోవడంతో వర్షం నీరు, వాడకం నీరు బయటకు వెళ్లక ఈగలు, దోమలు పెరిగి తీవ్ర అసౌకర్యంగా ఉంటోందని కాలనీ వాసులు చెబుతున్నారు. ఇంకా పూర్తి స్థాయి విద్యుత్ సౌకర్యం, తాగునీరు వంటి కనీస సౌకర్యాలు పూర్తిగా లేకపోవడంతో ప్రజలకు ఇబ్బందిగా ఉంటోందన్నారు. ఇక వేగాయమ్మపేటలో కాలనీ మంజూరై ఐదేళ్ల పూర్తయిన ఒక ఇల్లు కూడా నిర్మాణానికి నోచుకోలేదు. దీనిపై అధికారులు, ప్రజా ప్రతినిధులు స్పందించి జగన్ కాలనీల్లో కనీస సౌకర్యాలు ఏర్పాటు చేయాలని, రోడ్లు పూర్తిగా నిర్మించాలని ఆయా కాలనీల వాసులు కోరుతున్నారు.

ముంపు ప్రాంతాన్ని పరిశీలించిన కలెక్టర్

ప్రజాశక్తి-అమలాపురం
నక్కా రామేశ్వరం మొగ ప్రాంతంలో బీచ్ పరిసరాలను ముంపు ప్రాంతాన్ని జిల్లా కలెక్టర్ ఆర్. మహేష్ కుమార్ మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా స్థానిక రైతులు జిల్లా కలెక్టర్‌కు ఈ ప్రాంత ముంపు బెడదను నివారించి తమ పంటలను ముంపు నుంచి కాపాడుకునేందుకు వీలుగా పరిష్కార మార్గం చూపాలని విజ్ఞప్తి చేశారు.


మొగ ప్రాంతాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ మహేష్‌కుమార్

శాశ్వత ప్రాతిపదికన పరిష్కారం: కలెక్టర్

జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ నక్కా రామేశ్వరం బీచ్ సముద్ర ముఖ ద్వారం వద్ద ఇసుక మేట వేయడంతో ముంపు నీరు సముద్రంలోనికి వెళ్లక ప్రతి ఏడాది ఖరీఫ్ లో వరి పంటకు కోత దశలో నష్టం వాటిల్లుతోందని ఈ సమస్యను శాశ్వత ప్రాతి పదికన పరిష్కరించే దిశగా యోచన చేస్తామని అన్నారు. ఈ ప్రాంత భౌగోళిక పరిస్థితులు పై డ్రయినేజ్ మరియు జల వనరుల శాఖ ఇంజనీర్ల ద్వారా సమగ్రంగా అధ్యయనం చేసి ఈ ప్రాంత ముంపు బెడదకు శాశ్వత పరిష్కార మార్గం చూపుతామన్నారు. కొమరగిరి పట్నం నుంచి బీచ్ మార్గం ద్వారా ట్రాక్టర్‌పై పయనించి అధికారులతో నక్కా రామేశ్వరం మొగ్గ ప్రాంతం చేరుకొని బీచ్ పరిసరాలను ముంపు ప్రాంతాన్ని పరిశీలించారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ సునీల్ కుమార్, మండల పరిషత్ అభివృద్ధి అధికారి కృష్ణమోహన్, మండల ప్రజా పరిషత్ అధ్యక్షులు ఇళ్ల శేషగిరిరావు, డ్రయినేజీ డిఇ ఎవి.కిషోర్, స్థానిక ప్రజాప్రతినిధులుసత్తిరాజు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

జాబ్‌మేళాలను సద్వినియోగం చేసుకోవాలి

ప్రజాశక్తి-అమలాపురం
వికాస సంస్థ ఆధ్వ ర్యంలో నిర్వహిస్తున్న జాబ్ మేళాలను నిరుద్యోగ యువత సద్వినియోగం చేసుకోవాలని జిల్లా జాయింట్ కలెక్టర్ ఎస్ నుపూర్ అజయ్ అన్నారు. మంగళవారం స్థానిక కలెక్టరేట్లో వికాస ఆధ్వర్యంలో పలు కంపెనీలు ప్రతి నిధులతో జాబ్‌మేళాను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నేటి ప్రస్తుత మార్కెట్ అవసరాలకు తగ్గట్టుగా నైపుణ్యాలు దిశగా యువతను మార్చవ లసిన అవసరం ఎంతైనా ఉందన్నారు. నిరుద్యోగ యువతి, యువకుల జీవితాల్లో వెలుగు నింపుతూ ఆశాదీ పంగా వికాస సంస్థ నిలుస్తోందన్నారు ప్రతి ఒక్క నిరుద్యోగికి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పనలో వికాస సంస్థ కీలక భూమిక పోషిస్తోందన్నారు. ప్రయివేటు రంగంలో ఉద్యోగ అవకాశాలు చాలా ఎక్కువగా ఉన్నాయని వాటిని నిరుద్యోగ యువత అందిపుచ్చుకొని కష్టపడుతూ జీవి తంలో రాణించాలన్నారు. పదో తరగతి ఆపై ఉన్నత విద్యాభ్యాసం చేసి మధ్యలో చదువులు మానివేసిన నిరుద్యోగ యువతకు కమ్యూనికేషన్ స్కిల్స్‌పై ఉచిత శిక్షణ కార్యక్రమాలు నిర్వహించి ఆయా కంపెనీలకు అవసరమైన ఉద్యోగాలకు ఎంపిక చేయాలని సూచించారు. అర్హత కలిగిన కంపెనీల్లో ఉద్యోగాల్లో నిలదొక్కుకునేందుకు వికాస సంస్థ కషి చేస్తోందన్నారు. ఉద్యోగాలు పొందేందుకు అవసరమైన సాంకేతికతను ముందుగానే అలవర్చుకుంటే మంచి ఉద్యోగ అవకాశా లు పొందవచ్చునని యువతకు సూచిం చారు. ఒకవైపు ఉద్యోగాలు అవసరం ,మరోవైపు తగిన అభ్యర్థులు దొరక్క కార్పొరేట్ సంస్థలు సతమత మవుతున్నాయని, ఈ రెంటినీ బేరీజు వేసి ,నేటి ఆధునిక కార్పొరేట్ అవసరాలకు తగిన విధంగా నిరుద్యోగ యువతకు శిక్షణ ఇచ్చి ఉద్యోగావకాశాలు కల్పిస్తున్నాయని అన్నారు. తద్వారా ఈ శిక్షణలు ఉద్యోగ, స్వయం ఉపాధి అవకాశాలకు ఆలంబనగా మారతాయన్నారు. డిఆర్‌డిఎ ఎం.వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ఉద్యోగానికైనా భావ వ్యక్తీకరణ, కంప్యూటర్ పరిజ్ఞానం, భాషా పరిజ్ఞానం కమ్యూనికేషన్ స్కిల్స్ చాలా అవసరమన్నారు. వివిధ ప్రయివేటు సంస్థల్లో ఉద్యోగ అవకాశాలు ఉన్నప్పటికీ తగిన నైపుణ్యాలు, భాషా పరిజ్ఞానం భావవ్యక్తీ కరణ, కనీస కంప్యూటర్ పరిజ్ఞానం లేకపోతే ఏ సంస్థ కూడా ఉద్యోగంలోకి తీసుకోదన్నారు. నిరుద్యోగ యువత నైపుణ్యాలకు పెంపొందించుకుని ఉద్యోగావకాశాలు పొందాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో వికాస జిల్లా మేనేజర్ జి.రమేష్, కంపెనీల మానవ వనరుల ప్రతినిధులు పాల్గొన్నారు.


జాబ్ మేళాలో అధికారులతో మాట్లాడుతున్న జెసి

తాలూకా శెట్టిబలిజ సంఘం ఎన్నిక ఏకగ్రీవం

ప్రజాశక్తి -రామచంద్రపురం
తాలూకా శెట్టి బలిజ సంఘం మంగళవారం ఎన్నిక ఏకగ్రీవమైంది. పట్టణంలో గల తాలూకా శెట్టిబలిజ సంఘ భవనంలో సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ తాలూకా శెట్టిబలిజ అభివృద్ధి వివిధ అంశాలపై చర్చించారు. అనంతరం కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అధ్యక్షులుగా దొంగల శ్రీధర్, ఉపాధ్యక్షులుగా పంపన శ్రీనివాసు, పెంకె విశ్వేశ్వరరావు కార్యదర్శిగా కోట శ్రీనివాసరావు, కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గంలోని కె.గంగవరం, కాజులూరు, రామచంద్రపురం రూరల్, పట్టణం కార్యవర్గ సభ్యులు పాల్గొని ఏకాభిప్రాయంతో తాలూకా శెట్టిబలిజ సంఘాన్ని ఎన్నుకున్నారు. అనంతరం అధ్యక్షులు దొంగల శ్రీధర్ మాట్లాడారు. తాలూకా శెట్టిబలిజ సంఘం అభివృద్ధికి కృషి చేస్తానని అన్నారు. ఈ కార్యక్రమంలో రామచంద్రపురం నియోజకవర్గ శెట్టిబలిజ ప్రముఖులు తదితరులు పాల్గొన్నారు.

సర్వే ఉద్యోగుల సంఘం ఆవిర్భావ దినోత్సవం

ప్రజాశక్తి-ముమ్మిడివరం
నగర పంచాయతీ పరిధిలోని ఎయిమ్స్ ఇంజినీరింగ్ కళాశాల ప్రాంగణంలో జిల్లా సర్వే కార్యాలయంలో మంగళవారం సర్వే ఉద్యోగుల సంఘం ఆవిర్భావ దినోత్సవాన్ని జిల్లా అధ్యక్షుడు కె.ప్రభాకరరావు ఆధ్వర్యంలో నిర్వహించారు. సర్వే ఉద్యోగుల రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి దాసరి సాయిబాబు మాట్లాడుతూ రెవెన్యూ సర్వేయర్ల సమస్యల పరిష్కారానికి సంఘం కృషి చేసి, పరిష్కార మార్గాలు చూపాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన రాష్ట్ర కార్యవర్గ సభ్యులు తొలుత సర్వేయర్ల సంఘం వ్యవస్థాపక అధ్యక్షులు స్వర్గీయ జి.పట్టాభిరామయ్య చిత్ర పటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. పలువురు మాట్లాడుతూ పట్టాభి రామయ్య అందించిన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఇ.రామకృష్ణ, ఎం.శ్రీహర్ష, జె.చాందినీ దేవి, బి.ఉమాశంకర్, పి. శ్రీరామ్, ఇ.సూర్యతేజ, కె.బాలవెంకట్, ఎస్.తేజ, డిఐఒఎస్ గ్రామ, మండల, తాలూకా సర్వేయర్లు, జిల్లా కార్యవర్గ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



కార్యక్రమంలో పాల్గొన్న సర్వే ఉద్యోగులు


కలెక్టర్ మహేష్‌కుమార్‌ను సత్కరిస్తున్న రమణారావు


కలెక్టర్‌ను కలిసిన 'గుడ్‌సీడ్' ఫౌండర్ రమణారావు

ప్రజాశక్తి-అమలాపురం
జిల్లా రెండో కలెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించిన రావిలాల మహేష్‌కుమార్‌ను మంగళవారం గుడ్ సీడ్ ఫౌండేషన్ ఫౌండర్ కుంచే రమణారావు కలెక్టరేట్‌లో మర్యాదపూర్వకంగా కలిసి అభినందించారు. కలెక్టర్ మహేష్‌కుమార్‌ను రమణారావు దుశ్శాలువాతో సత్కరించి జ్ఞాపికను అందజేశారు. గుడ్ సీడ్ ఫౌండేషన్ ద్వారా చేపడుతున్న సేవా కార్యక్రమాలను కలెక్టర్‌కు వివరించారు. కలెక్టర్ ను అభినందించిన వారిలో సర్పంచ్‌లు పెయ్యల రాజ్ కుమార్, బీర రాజారావు, నాయకులు పినిపే జయరాజు, నేరేడుమిల్లి శ్రీను, గంటా లక్ష్మీప్రసాద్, పరమట రాజేష్, నాగాబత్తుల రాజ్ కుమార్ తదితరులు ఉన్నారు.

'బికామ్' కోర్సు కొనసాగించాలని డిమాండ్

ప్రజాశక్తి-ఆలమూరు
రాష్ట్ర ప్రభుత్వ డిగ్రీ కళాశాలల్లో బీకామ్ జనరల్ కోర్సును ఎత్తివేస్తున్నట్లు తీసుకున్న నిర్ణయాన్ని తక్షణమే రాష్ట్ర ప్రభుత్వం ఉపసంభరించుకోవాలని ఎఐఎస్ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి జి.రవికుమార్ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కొత్తూరు సెంటర్ వద్ద ఆయన మంగళవారం విలేకరులతో మాట్లాడారు.

కార్టూ'నిజం'



గ్రామసభల ద్వారా సిసిఆర్ కార్డులు అందజేయాలి

ఎపి కౌలు రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి హరిబాబు

ప్రజాశక్తి -మామిడికుదురు
కౌలు రైతులకు భూ యజమానులతో సంబంధం లేకుండా గ్రామసభల ద్వారా సిసిఆర్ కార్డులు ఇవ్వాలని ఎపి కౌలురైతుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం.హరిబాబు డిమాండ్ చేశారు. మామిడికుదురు అంబేద్కర్ కమ్యూనిటీ హాల్లో మంగళవారం సంఘం జిల్లా అధ్యక్షులు అప్పారి వెంకటేశ్వరావు అధ్యక్షతన కౌలు రైతుల సదస్సులో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో కౌలు రైతుల సంఖ్య క్రమంగా పెరుగుతోందని 70 శాతం భూమిని కౌలు రైతులే సాగు చేస్తున్నారని అన్నారు. కౌలు వ్యవసాయం లాభదాయకంగా లేకపోయినా, వేరే వృత్తులకు వెళ్లలేక గ్రామాల్లో ఉన్న దళిత, వెనుకబడిన తరగతుల వారు ఇతర కులాల్లోని భూమిలేని పేదలు కౌలుపై ఆధార పడుతున్నారని అన్నారు. వీరికి భూయజమాని సంతకం నిబంధనలేకుండా సిసిఆర్ గుర్తిపు కార్డులు ఇవ్వాలన్నారు. విత్తనాలు, ఎరువులు, పురుగు మందుల ధరలు పెట్రోల్, డీజిల్ ధరలు, దుక్కి, దమ్ము, ట్రాక్టర్ కిరాయిలు, కోత, పోత మిషన్ కిరాయిలు విపరీతంగా పెరుగుతున్నాయన్నారు. అధిక, అకాల వర్షాలు, తుపానుల ప్రభావం తో నోటికి వచ్చిన పంటను నష్ట పోతున్నారని మరోవైపు ప్రభుత్వం పంట, మురుగు కాలువలు బాగు చేయించడం లేదని అన్నారు. కౌలు వ్యవసాయం గిట్టుబాటు కాక, పెట్టుబడికి ప్రభుత్వ బ్యాంకుల్లో అప్పులు రాక, అప్పులు పాలై కొంతమంది ఆత్మహత్యలు కూడా చేసుకుంటున్నారని వాపోయారు. సొంత రైతులే గిట్టుబాటు కాక వ్యవసాయాన్ని వదిలి వేస్తుంటే కౌలు రైతులే ప్రజలందరికీ ఆహారాన్ని అందించే బాధ్యత తమ భుజాలకుకెత్తుకుంటున్నారని అన్నారు. రైతులు అనేక పోరాటాలు చేసి 2011లో ఎల్ఇసి చట్టాన్ని సాధించుకున్నారని అన్నారు. ఆచట్టం ప్రకారం 2019లో వచ్చిన వైసిఎ. ప్రభుత్వం పాత కౌలు చట్టాలను రద్దుచేసి, కార్డుపై యజమాని సంతకం తప్పనిసరి చేసి, కొత్త చట్టాన్ని తీసుకువచ్చిందన్నారు. దీనితో భూ యజమానులు సంతకం పెట్టటానికి ముందుకు రావడం లేదన్నారు. అందువలన కార్డుల సంఖ్య గణనీయంగా తగ్గిపోయిందన్నారు . ప్రభుత్వం తమ టార్గెట్ పూర్తి చేయడానికి భూ యజమాని చెప్పిన వారికి, వారి అనుచరులకు, బంధువులకు, కార్డులు ఇస్తున్నారని దీనితో బినామీ కార్డులు ఎక్కువగా వస్తున్నాయని కౌలు చేస్తున్న వాస్తవ సాగుదారులకు కార్డులు రావడం లేదని ఆందోళన వ్యక్తం చేశారు ఫలితంగా కౌలు రైతులు నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కొత్తగా వచ్చిన ప్రభుత్వం కౌలు రైతులను ఆదుకోవాలంటే, ఇప్పుడున్న సిసిఆర్‌సి చట్టాన్ని రద్దుచేసి, 2011 ఎల్ఇసి చట్టాన్ని తిరిగి అమలు చేసి, రాష్ట్రవ్యాప్తంగా ఉన్న 40 లక్షల కౌలు రైతుల కుటుంబాలను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర నాయకులు బి.బలరాం, ఆండ్రామాల్యాద్రి మాట్లాడుతూ కౌలు రైతుల సమస్యలు పరిష్కారానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చిత్తశుద్ధితో పనిచేయాలని, స్వామినాథన్ సిఫార్సులు అమలు చేయాలని రైతు పండించిన ధాన్యానికి 50 శాతం అదనంగా గిట్టుబాటు ధర చెల్లించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి పీతల రామచంద్రరావు రాజోలు నియోజకవర్గ తెలుగు రైతు అధ్యక్షులు ఈలి శ్రీనివాసరావు, కారెం వెంకటేశ్వరరావు తాటికాయల ఉదయ భాస్కరరావు, పెచ్చెట్టి విజయ భాస్కరరావు, తాడి శ్రీరాంమూర్తి, పొలమూరి శ్రీనివాసరావు కౌలు రైతులు తదితరులు పాల్గొన్నారు.



మండల కౌలురైతుల సదస్సులో ప్రసంగిస్తున్న రాష్ట్ర కార్యదర్శి హరిబాబు


శుభాకాంక్షలు చెబుతున్న మండల జనసేన నేతలు

ఎంపీ హరీష్‌ను కలిసిన జనసేన నాయకులు

ప్రజాశక్తి-మామిడికుదురు
అమలాపురం పార్లమెంటు సభ్యులు గంటి హరీష్ మాధుర్‌ను ఆయన క్యాంపు కార్యాలయంలో మంగళవారం మామిడి కుదురు మండల జనసేన నాయకులు మర్యాదపూర్వకముగా కలిసి పూల బొకే అందజేసి విజయోత్సవ శుభాకాంక్షలు తెలిపారు ఈ కార్యక్రమంలో మామిడి కుదురు మండల జనసేన అధ్యక్షుడు జాలెం శ్రీనివాస రాజా, పాశర్లపూడి ఉప సర్పంచ్ తుండూరి శ్రీనివాసరావు (బుజ్జి), కంకిపాటి నరసింహారావు, మంద గాంధీ తదితరులు పాల్గొన్నారు.

ఎంపీ హరీష్‌కు సత్కారం

అమలాపురం రూరల్: ఎంపీగా ప్రమాణ స్వీకారం చేసిన అనంతరం తొలిసారి అమలాపురం విచ్చేసిన గంటి హరీష్ మాధుర్‌ని మంగళవారం అమలాపురంలో శ్రీశైలం మాజీ ట్రస్టీ చింతా శంకరమూర్తి ఆధ్వర్యంలో కలిశారు. ఈ సందర్భంగా ఎంపీని సత్కరిం చారు. ఎంపీ హరీష్ మాట్లాడుతూ బండారు లంక చేనేత కార్మికుల సమస్యలు తెలుసుకొని చేనేత అభివృద్ధికి తన వంతు సహకారం అందిస్తానని, త్వరలోనే బండారు లంక వస్తావని హామీ ఇచ్చారు. కార్యక్ర మంలో చింతా అత్తిలింగం, పుచ్చల వరద రాజులు, నాయకులు పాల్గొన్నారు.

కొత్తపేట: ఎంపీ హరీష్‌ను పాలూరి సత్యానందం మంగళవారం అమలాపురం కార్యాలయంలో కలిశారు. వీరివెంట మోకా వెంకట సుబ్బారావు, వినియోగదారుల సంఘం చైర్మన్ అరిగెల వెంకట రామారావు, మామిడికుదురు మండల అధ్యక్షుడు మెండ ఆదినారాయణ, గాడి సత్తిబాబు తదితరులు కలిసి ఎంపీని సత్కరించారు.

టిడిపి నాయకుడు బుల్లియ్యకు సత్కారం

ప్రజాశక్తి-అంబాజీపేట
టిడిపి ఆవిర్భావ నుంచి పార్టీలో ఉంటూ సేవలందిస్తున్న పుల్లేటికుర్రుకు చెందిన టిడిపి సీనియర్ నాయకులు వక్కలంక బుల్లియ్యను మంగళవారం పి.గన్నవరం ఎంఎల్ఎ గిడ్డి సత్యనారాయణ మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సత్కరించారు. ఆయన సేవలను ఎంఎల్ఎ తెలుసుకున్నారు. పార్టీలో కార్యకర్త ఎవరైనా పుట్టినరోజు, పెళ్లి రోజు తదితర శుభకార్యాలకు హాజరై బుల్లియ్య చిరుకానుక అందజేస్తారు. ఆపదలో ఉన్నవారికి సాయం అందజేస్తారు. ఆయన పార్టీకి మరిన్ని సేవలందించాలని ఆకాంక్షిస్తూ ఎంఎల్ఎ గిడ్డి టిడిపి నేత బుల్లియను అభినందించారు..

గోదావరిలో చేపల మృతి పై విచారణ చేయాలి

బ్రహ్మపురి, మసకపల్లి, వాసాలరేవు మత్స్యకారుల డిమాండ్

ప్రజాశక్తి-రామచంద్రపురం
యానాం నుంచి మసకపల్లి వరకు గల గోదావరి తీర ప్రాంతంలో 20 టన్నుల వరకు చేపలు మృతి చెందడంపై మత్స్యకారులు ఆందోళన వ్యక్తం చేశారు. ఈ సంఘటనపై విచారణ జరపాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు బ్రహ్మపురి, మసకపల్లి, వాసాల రేవు, దంగేరు గ్రామాల్లోని మత్స్యకారులు మంగళవారం సమావేశం అయ్యారు. వారు మాట్లాడుతూ గత 50 ఏళ్లుగా చేపలు మృతి చెందటం గోదావరి మంచినీటిలో ఇప్పటివరకు జరగలేదన్నారు. దీనికి గోదావరి జలాల కాలుష్యమే కారణమని వారు ఆరోపించారు. ఎక్కడ సముద్రం నుంచి ఆయిల్ తీస్తున్న రిఫైనరీ కంపెనీలు ఒఎన్‌జిసి, రిలయన్స్ కంపెనీలు వదులుతున్న వ్యర్థాల వల్ల గాని, యానాం గోదావరి తీరంలో ఉన్న ఫ్యాక్టరీలు నుంచి వచ్చే వ్యర్థాల వల్ల జలాలు కొలుషితమై చాపలు చనిపోయి ఉండొచ్చని వారు భావిస్తున్నారు. మత్స్యశాఖ అధికారులు చెబుతున్నట్లువాతావరణ ప్రభావం వల్ల చేపలు చనిపోయి ఉంటే అన్ని రకాల చేపలు ఒకేసారి చనిపోతాయని, అలా కాకుండా కానాగంత చేపలు మాత్రమే చనిపోవడంతో కలుషితమైన జలాలకు కానాగంత జాతి చేపలు తట్టుకోలేవని వారు అనుమానిస్తున్నారు. దీనిపై మత్స్య శాఖ అధికారులు నీటి కాలుష్యంపై సరైన పరీక్షలు నిర్వహించి తమ సందేహాలు నివత్తి చేయాలని ఫ్యాక్టరీల వ్యర్థాలు కాలుష్య నీరు గోదావరిలో రాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని, ఉపాధి కోల్పోయిన మత్స్యకారులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. సమావేశంలో డెమొక్రటిక్ ట్రెడిషనల్ వర్కర్స్ ఫోరం ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాల అధ్యక్షులు దోమ ఆదినారాయణ, బ్రహ్మపురికి చెందిన చొల్లంగి ఎదుర్లయ్య, మసకపల్లికి చెందిన వాతాడ బుజ్జి, జంగిరోకు చెందిన బలసాల లక్ష్మయ్య, తదితర నాయకులు ప్రసంగించారు. పూర్తిస్థాయి న్యాయవిచారణ జరపాల జిల్లా అధికారులకు మత్స్యకార సంఘం నాయకులు విజ్ఞప్తి చేశారు.


వాసాలరేవులో మత్స్యకారుల సంఘం నాయకుల సమావేశం

అంబేద్కర్ విగ్రహాల రక్షణకు చర్యలు

ప్రజాశక్తి-ఆలమూరు
జొన్నాడలో అంబేద్కర్ విగ్రహలకు సిసి కెమెరాలతో రక్షణ చర్యలు చేపట్టామని ఎస్ఐ ఎల్.శ్రీను నాయక్ అన్నారు. ఇందులో భాగంగా జొన్నాడలో అంబేద్కర్ విగ్రహా నికి విగ్రహ ప్రదేశంలో సిసి కెమెరాలు ఏర్పాటును ఆయన పరిశీలించారు. ఎస్ఐ శ్రీను నాయక్ మాట్లాడుతూ అల్లరి మూకలు, దొంగల బారి నుంచి విగ్రహాలు ధ్వంసం చేయకుండా సిసి కెమెరాల ద్వారా కాపాడుకోవచ్చన్నారు. ఇక్కడే కాకుండా కొత్తూరు, చింతలూరు, జొన్నాడలో ఇతర మూడు జంక్షన్లు వద్ద సిసి కెమెరాలు ఏర్పాటు చేశామనితెలిపారు. అలాగే ప్రతి గ్రామంలో జొన్నాడ గ్రామస్తులు చేసుకున్న విధానాన్ని ఆదర్శంగా తీసు కుని విగ్రహాల వద్ద, ఆలయాల వద్ద కెమెరాలను ఏర్పాటు చేసు కోవాలని గ్రామ పెద్దలకు, ఆలయ కమిటీలకు ఎస్ఐ సూచించారు. అనంతరం అంబేద్కర్ విగ్రహానికి ఎస్ఐ శ్రీను నాయక్, స్థానిక మాజీ ఉప సర్పంచ్ తాడి శ్రీనివాస రెడ్డి తదితరులు పూలమాలలు వేశారు.


సిసి కెమెరాల ఏర్పాటు పరిశీలిస్తున్న ఎస్ఐ శ్రీనునాయక్

పశువుల యాజమాన్యంపై కార్యదర్శి ఫిర్యాదు

ప్రజాశక్తి-కాట్రేనికోన
కాట్రేనికోన పంచాయతీ కార్యదర్శి కె.శ్రీనివాస్ మంగళవారం పశువుల యజమానులపై పోలీసులకు ఫిర్యాదుచేశారు. వివరాలు ఇవి.. కాట్రేనికోన పంచాయతీ పరిధిలో పశువులు రోడ్లపై తిరుగుతూ ప్రయాణికులను ప్రజలను ఇబ్బందులకు గురి చేస్తున్నాయని వీటివల్ల ప్రయాణకులు అనేక ప్రమాదాలకు గురయ్యారని కార్యదర్శి తెలిపారు. వీటి విషయమై పశువుల యజమానులకు గతంలో నోటీసులు ఇచ్చిన స్పందించడం లేదన్నారు. దీంతో వారిపై క్రిమినల్ చర్యలు తీసుకోవాలని కోరుతూ కార్యదర్శి కె.శ్రీనివాస్ పోలీసులకు ఫిర్యాదు చేశారు.

గర్భిణులకు పౌష్టికాహారం అందజేత

ప్రజాశక్తి-యంత్రాంగం
ప్రధానమంత్రి సురక్ష మాతృత్వ యోజన కార్యక్రమంలో భాగంగా మంగళవారం పలు పిహెచ్‌సిల్లో గర్భిణులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. అనంతరం పలుచోట్ల గర్భిణులు పౌష్టికాహారం కిట్లు అందజేశారు.

అంబాజీపేట: గర్భిణులు వైద్యుల సూచనలు పాటించి పోషకాహారం తీసుకుని జాగ్రత్తలు పాటించాలని పి గన్నవరం ఎంఎల్ఎ గిడ్డి సత్యనారాయణ అన్నారు. అంబాజీపేట పిహెచ్‌సి వద్ద ప్రధానమంత్రి సురక్ష మాతృత్వ యోజన కార్యక్రమంలో భాగంగా వైద్యాధికారి డాక్టర్ వి.గౌతమి ఆధ్వర్యంలో గర్భిణులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. అనంతరం నిర్వహించిన కార్యక్రమంలో ఎంఎల్ఎ ముఖ్య అతిథిగా పాల్గొని జనసేన నాయకులు సమకూర్చిన పౌష్టికాహార కిట్లను గర్భిణు లకు అందజేశారు. కార్యక్రమంలో ఎంపిపి డి.వెంకటేశ్వరరావు, జెడ్‌పిటిసి సభ్యురాలు బూడిద వరలక్ష్మి, సర్పంచ్ నాగాబత్తుల శాంతాకుమారి, సుబ్బారావు, గణపతి వీర రాఘవులు, పిహెచ్ సి మాజీ అభివృద్ధి కమిటీ చైర్మన్ మేడిది చిన్నా, కొర్లపాటి ఢిల్లీ, నాయకులు, పిహెచ్‌సి సిబ్బంది పాల్గొన్నారు. ముక్కామల పిహెచ్‌సిలో వైద్యాధికారి ఎ.ఇంద్రావతి, జి.గీతాంజలి లు 21 మంది గర్భిణులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. దాతలు సత్య సాయి సేవా సమితి, బచ్చు నాగేశ్వరరావు (వక్కలంక), వాసవి క్లబ్ తరఫున మల్లేశ్వరరావు(ముక్కామల) వారి సహకారంతో సిరప్‌లు, కాల్షియం ఐరన్ ఫోలిక్ మాత్రలు, పండ్లు అందజేశారు. సిహెచ్‌ఒ, ఎంపిహెచ్‌ఎస్, సిబ్బంది పాల్గొన్నారు. **అమలాపురం రూరల్:** పేరూరు పిహెచ్‌సిలో జరుగుతున్న ప్రధాన మంత్రి సురక్షిత్ మాతృత్వ యోజన కార్యక్రమాన్ని మంగళవారం అదనపు జిల్లా వైద్యాధికారి సి.హెచ్.భరతలక్ష్మి పరిశీలించారు. అనంతరం ఆరోగ్య సిబ్బందికి ఈ నెల 18 నుంచి జరుగు లెప్రసీ అవగాహన కార్యక్రమము సర్వే గురించి పలు సూచనలు చేశారు. అలాగే కేంద్రములో జరుగుతున్న డెంగీ వ్యతిరేక మాసోత్సవంలో భాగంగా జరిగిన ర్యాలీ లో పాల్గొన్నారు. కార్యక్రమంలో స్థానిక వైద్యాధికారి డాక్టర్.డివి.సత్యం, ఎమ్‌పిహెచ్‌ఇఒ కె.సత్యనారాయణ, సబ్‌యూనిట్ ఆఫీసర్ రామరావు, టిబి సూపర్‌వైజర్ రాఘవేంద్ర, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు. **మామిడికుదురు:** లూటుకుర్రు పిహెచ్‌సి వైద్యాధికారి డాక్టర్ రమ్య శైలజ ఆధ్వర్యంలో, నగరం పిహెచ్‌సిలో గర్భిణులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. **కపిలేశ్వరపురం:** అంగర పిహెచ్‌సిలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో 24 మంది గర్భిణులకు డాక్టర్ పిఎన్‌ఎస్‌డి.రత్నకుమారి వైద్య పరీక్షలు నిర్వహించి వారికి మందులను అందజేశారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది పాల్గొన్నారు.


అంబాజీపేట పిహెచ్‌సిలో గర్భిణులకు పౌష్టికాహారం అందిస్తున్న ఎంఎల్ఎ గిడ్డి

నేరాలు ఘోరాలు


పిడిఎస్ బియ్యం స్వాధీనం చేసుకుంటున్న అధికారులు

పిడిఎస్ బియ్యం స్వాధీనం

ప్రజాశక్తి-అమలాపురం

అక్రమంగా నిల్వ ఉంచిన పిడిఎస్ బియ్యాన్ని మంగళవారం అధికారులు స్వాధీనం చేసుకుని పలువురు వ్యక్తులపై కేసులు నమోదు చేశారు. వివరాలు ఇవి.. కాకినాడ జిల్లా కోటనందూరు మండలం కోటనందూరులో మహాలక్ష్మి రైస్‌మిల్ నందు విజిలెన్స్ అధికారులు, రెవెన్యూ సివిల్ సప్లయ్స్ అధికారులతో కలిసి తనిఖీ చేసి అక్రమంగా నిల్వ ఉన్న సుమారు 25300 కేజీల పిడిఎస్ బియ్యాన్ని గుర్తించారు. దీనికి సంబంధించి పోతల రాంబాబు, శెట్టి శ్రీనివాసరావ్, కోన ప్రభుదాస్, మోహన్ లాల్ యాదవ్, ఆనంద్ దేవాంగన్ సంబంధిత వ్యక్తులపై క్రిమినల్ కేసు నమోదు కొరకు కోటనందూరు పోలీసులకు సిఫారసు చేశారు. అనంతరం అధికారులు పలు వస్తువులను స్వాధీనం చేసుకున్నారు. వీటి విలువ సుమారు రు. 40,93,548 నిర్ధారించారు. అంబేద్కర్ కోనసీమ జిల్లాలో రాయవరం మండలంలో మాచవరం గ్రామంలో సరిట వీధి ఏరియాలో అక్రమంగా నిల్వ ఉంచిన సుమారు రూ.1,09,700 విలువ గల 2411 కేజీల పిడిఎస్ బియ్యాన్ని అధికారులు స్వాధీనం చేసుకున్నారు. దీనికి సంబంధించి మేడపాటి రామారెడ్డి సంబంధిత వ్యక్తులపై క్రిమినల్ కేసు నమోదు కొరకు రాయవరం పోలీస్ స్టేషన్ కు సిఫారసుచేశారు. ఈ తనిఖీల్లో విజిలెన్స్ అధికారులు ఎస్ఐ జగన్నాధరెడ్డి, ఎఒ భార్గవ మహేష్, ఎజి లక్ష్మీనారాయణ, డిసిటిఒ నవీన్ కుమార్, పిసిఎస్‌లోవరాజు, వలీ, వీరబాబు, శివ సివిల్ సప్లయ్స్ అధికారులు పాల్గొన్నారు.


తనిఖీలు నిర్వహిస్తున్న విజిలెన్స్ అధికారులు

ఎరువుల దుకాణాలపై 'విజిలెన్స్' తనిఖీలు

ప్రజాశక్తి-సీతానగరం

మండలంలో మంగళవారం ఎరువులు, పురుగు మందుల దుకాణాల్లో వ్యవసాయ మరియు విజిలెన్స్ అధికారులు తనిఖీలు చేశారు. సీతానగరం, చినకొండేపూడి, బొబ్బిల్లంక, రఘుదేవపురం దుకాణాల్లో పలు రకాల రికార్డులను పరిశీలించారు. అనుమానం అనిపించిన ఎరువుల శాంపిళ్ళను నాణ్యత నిమిత్తం ల్యాబ్‌కు పంపించారు. అనంతరము ఎరువుల బస్తాలను తూకం వేసి బస్తాలో ఎరువులు 50 కేజీలు ఉన్నవో లేదో అని పరిశీలించారు. నాణ్యత లేని ఎరువులు, పురుగు మందులు అమ్మితే చర్యలు తీసుకుంటామని దుకాణ యజమాను దారులను హెచ్చరించారు .ఈ తనిఖీల్లో డిడిఎ మోహనరావు, విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్ మెంట్ అధికారి సింహాచలం, కోరుకొండ ఎడిఎ మల్లిఖార్జునరావు, టెక్నికల్ ఎఒ శివశ్రీనివాస్, మండల వ్యవసాయాధికారి కె.సూర్య రమేష్ హాజరయ్యారు.

ముమ్మిడివరంలో క్షుద్రపూజల కలకలం

ప్రజాశక్తి-ముమ్మిడివరం

ముమ్మిడివరం నగర పంచాయతీ పరిధిలోని బళ్ల గేటు సెంటర్ లోని స్థానిక పోలీస్ క్వార్టర్స్ వెనుక ఒక నివాస గహంలో గత 15 రోజులుగా క్షుద్ర పూజలు జరుగుతున్నట్లు స్థానికులు ఆరోపిస్తున్నారు. దీంతో అక్కడ ఉన్న వారు సాయంత్రం బయటికి రావాలంటే భయపడుతున్నామంటున్నారు. అయితే దీనిపై పోలీసులకు ఫిర్యాదు చేస్తే తమ మీద ఏమైనా క్షుద్ర పూజలు ప్రయోగం చేస్తారేమోనని పలువురు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అయితే దీనిపై స్థానికులు ముమ్మిడివరం పోలీసులకు సమాచారం అందించడంతో ముమ్మిడివరం ఎస్ఐ డి.సురేష్ బాబు ఆ వ్యక్తిని స్టేషన్ కు పిలిపించి విచారించారు. తాను ఇంట్లో పూజలు చేసుకుంటున్నానని తనంటే కిట్టినవారు ఈ రకంగా ప్రచారం చేస్తున్నారన్నారు. తనను ఇల్లు ఖాళీ చేయమని ఒత్తిడి చేస్తున్న ఖాళీ చేయకపోవడంతో తనపై దుష్ప్రచారం చేస్తున్నారని తెలిపినట్లు సమాచారం. తనపై వస్తున్న ఆరోపణలతో అతను ఇల్లు ఖాళీ చేసి వెళ్లిపోయినట్లు తెలిసింది.

పురుషోత్తపట్నం ఫెర్రీ రేవు వేలం

ప్రజాశక్తి-సీతానగరం

మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో మంగళవారం పురుషోత్తపట్నం నుంచి పోలవరం గ్రామానికి ఫెర్రీ రేవు వేలం పాటను ఎంపిడిఒ కృష్ణ ప్రసాద్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఫెర్రీ రేవు పాటను పాలడుగు రత్నాజీ రావు రూ.16,42,599కు టెండర్ ద్వారా దక్కించుకున్నారని జిల్లా పరిషత్ కాకినాడ అధికారి సిహెచ్.శాస్త్రి అన్నారు. ఈ సందర్భంగా సిహెచ్.శాస్త్రి మాట్లాడుతూ రేవు పాటకు ముగ్గురు పాటదారులు పాల్గొనగా అందులో ఒకరు డిస్క్ క్వాలిఫై అయ్యారని తెలిపారు. చివరకు ఇద్దరు మాత్రమే పాటలో పాల్గొనగా పాటను రత్నాజీ రావుకు హెచ్చు పాటగా ఖరారు చేశామని అన్నారు. రేవు దాటించడానికి ఆరు సంవత్సరాలు కలిగిన పిల్లలకు రూ.25 ఛార్జ్ చేయబడుతుందన్నారు. ద్విచక్ర వాహనానికి రూ.50, ద్విచక్ర వాహనం మరియు వ్యక్తికి రూ.75, మేక లేక గొర్రెకు రూ.25, పందికి రూ.50, ఆవు,దున్న, ఎద్దు, గేదెకు రూ.250, ఛార్జ్ చేయబడుతుందన్నారు. లగేజీ 25 కేజీల లోపు రూ.15 ,లగేజీ 50 కేజీల లోపు రూ.25 చార్జీలను రేవు పాట దారులకు ప్రజలు ఇవ్వాల్సి ఉంటుందని అన్నారు. ఈ రేవు రెండు జిల్లాలకు చెందినదిగా కలిగి ఉందని తూర్పుగోదావరి జిల్లా, పశ్చిమగోదావరి జిల్లా వారికి ఈ పాటలో వచ్చిన మొత్తాన్ని చెరిసగం అందజేస్తారని అన్నారు. అందులో జిల్లా ఆదాయాన్ని 100 శాతంగా పరిగణించి పంచాయతీకి, మండల పరిషత్‌కు,జిల్లా పరిషత్ కు అందజేస్తారన్నారు. కార్యక్రమంలో పోలవరం మండల ఎంపిడిఒ శ్రీను, పోలవరం ఎంపిపి సుంకర వెంకటరెడ్డి, సీతానగరం మండల ఎంపిపి గుర్రాల జ్యోత్స్న, సీతానగరం మండలం ఎంపిడిఒ కృష్ణ ప్రసాద్, సీతానగరం మండల ఇఒపిఆర్‌డి మూర్తి, చల్లమళ్ళ సుజీరాజు, పురుషోత్తపట్నం గ్రామ కార్యదర్శి మున్నీదీప్తి, ఎంపిడిఒ కార్యాలయ సిబ్బంది, పోలీసు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

యానాం వార్తలు


అధికారులతో సమీక్షిస్తున్న ఎంఎల్ఎ అశోక్

అభివృద్ధి పనులు వేగవంతం చేయాలి

ప్రజాశక్తి - యానాం

నియోజకవర్గంలో పెండింగ్లో ఉన్న అభివృద్ధి పనులను వేగవంతం చేయాలని ఎంఎల్ఎ గొల్లపల్లి శ్రీనివాస్ అశోక్ ఆదేశించారు. మంగళవారం స్థానిక బెజవాడ గార్డెన్‌లోని ఎంఎల్ఎ కార్యాలయంలో అధికారులతో సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజవర్గ వ్యాప్తంగా చేపట్టిన పనులను త్వరితగతిన పూర్తి చేయాలని, కొత్తగా మరికొన్ని పనులు చేపట్టాలని అందుకు సంబంధించి టెండర్లకు పిలవాలని కోరారు. అనంతరం అధికారులతో కలిసి రాజీవ్ బీచ్‌ను పరిశీలించారు. వరద నీరు చేరకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని ఆదేశించారు. పర్యాటకులను ఆకర్షించేందుకు బీచ్ లో 'ఐ లవ్ యానాం' లోగోను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ ఇన్‌ఛార్జ్ కమిషనర్ ఖండవల్లి రామకృష్ణ, పిడబ్ల్యూడి ఇఇ చంద్రశేఖరన్, ఎఇ కాళ్ళ నాగరాజు, జెఇలు భాస్కర్, భగవాన్, ప్రసాద్ పాల్గొన్నారు.


రోడ్లు, డ్రెయిన్లు నిర్మించాలని ఎంఎల్ఎను కోరుతున్న మహిళలు

రోడ్లు, డ్రెయిన్లు నిర్మించాలి

ప్రజాశక్తి - యానాం

స్థానిక కనకాలపేట గణపతి నగర్‌లో రోడ్లు డ్రెయిన్లు నిర్మించాలనిగ్రామ మహిళలు ఎంఎల్ఎ గొల్లపల్లి శ్రీనివాస్ అశోక్‌ను మంగళవారం కలిసి వినతి పత్రం అందించారు. ఎన్నో ఏళ్లుగా రోడ్లు డ్రెయినేజీలు లేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని, వాడకం నీరు ఇంటి ముందే ఉండడంతో దోమలు పేరుకుపోయి వ్యాధులు బారిన పడుతున్నామని మహిళలు ఆవేదన వ్యక్తం చేశారు. ఎంఎల్ఎ అశోక్ మాట్లాడుతూ ఎంఎల్ఎ నిధులు ప్రభుత్వం నుంచి రావాల్సివుందని, ఆ నిధులు రాగానే పనులు ప్రారంభించేందుకు చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు. అనంతరం స్థానిక చెల్లి గార్డెన్లో రోడ్లు, డ్రెయిన్లు నిర్మాణ పనులను పరిశీలించారు.

నిబంధనలు అతిక్రమిస్తే కఠిన చర్యలు: ఆర్‌డిఒ

ప్రజాశక్తి - పిఠాపురం


సమావేశంలో మాట్లాడుతున్న ఆర్‌డిఒ కిషోర్

నియోజవర్గవ్యాప్తంగా నిబంధనలను అతిక్రమించి కబేలాలు నిర్వహిస్తే కఠిన చర్యలు తప్పవని ఆర్‌డిఒ కిషోర్ హెచ్చరించారు. మంగళవారం నియోజవర్గ స్థాయి పసుమాంస వర్తకులతో మున్సిపల్ కౌన్సిల్ కార్యాలయంలో సమీక్ష సమావేశం నిర్వహించారు. నియోజవర్గ పరిధిలో అక్రమ పశు రవాణా, కబేలాలు నిర్వహించిన, పశు విక్రయాలు చేసిన, గోవధ చేసిన చట్ట ప్రకారం చర్యలు తీసుకోవడం జరుగుతుందని హెచ్చరించారు. అనుమతులు ఉన్న కబేలాలోనే మాంసం విక్రయాలు కటింగ్ చేయాలని సూచించారు. ఎక్కడపడితే అక్కడ పశువులు వధ చేస్తూ ఉంటే కేసులు ఉనమోదు చేసి చర్యలు తీసుకుంటా మన్నారు. మాంసం విక్రయిదారులందరూ ఈ సూచనలు తప్పక పాటించాలని లేకుంటే సివిల్ క్రిమినల్ కేసులకు బాధ్యులు అవ్వవలసి ఉంటుందని హెచ్చరించారు. మాంసం విక్రయాలే మాకు జీవనాధారమని, జిల్లా వ్యాప్తంగా లేని రూల్ పిఠాపురంలో అమలు చేయడంపై వర్తకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. కలెక్టర్ ఆదేశాలను తప్పనిసరిగా విక్రయదారులు పాటించాలని ఆర్‌డిఒ సూచించారు. ఈ సమావేశంలో సిఐ జి.శ్రీనివాస్, కమిషనర్ నామ కనకారావు, తహశీల్దార్లు, ఎంపిడిఒలు, పాల్గొన్నారు.

చెడు అలవాట్లతో జీవితాలు నాశనం

ప్రజాశక్తి - గండేపల్లి


అవగాహన సదస్సులో మాట్లాడుతున్న ఎస్ఐ రామకృష్ణ

యువత, విద్యార్థులు చెడు వ్యసనాలకు బానిసలుగా మారితే జీవితాలు నాశనం అవుతాయని ఎస్ఐ ఎన్.రామకృష్ణ అన్నారు. మంగళవారం మండలం రామేశ్వరం పేట ప్రగతి కళాశాలలో చెడు వ్యసనాల వల్ల కలిగే అనర్థాలు, హెల్మెట్ ధరించడం ద్వారా కలిగే ప్రయోజనాలపై అవగాహన కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గంజాయి, సిగరెట్ తాగటం వంటి వ్యసనాలకు దూరంగా ఉండాలని, బాగా చదువుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కాలేజీ యాజమాన్యం ప్రతినిధులు, విద్యార్థులు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

రోగులకు రొట్టెలు, పండ్లు పంపిణీ

ప్రజాశక్తి - తాళ్లరేవు

మండల టిడిపి కార్యదర్శి కట్ట త్రిమూర్తులు పుట్టిన రోజును పురస్కరించుకుని స్థానిక పిహెచ్‌సిలో రోగులకు పండ్లు, రొట్టెలు పంపణీ చేశారు. మంగళవారం పార్టీ కార్యాలయంలో ధూళిపూడి బాబి ఆధ్వర్యంలో కేక్ కటింగ్ కార్యక్రమంలో ఎంఎల్ఎ దాట్ల సుబ్బరాజు పాల్గొన్నారు. అనంతరం రోగులకు సేవా కార్యక్రమాన్ని నిర్వహించారు. పుట్టిన రోజున సేవా కార్యక్రమాలు చేపట్టడం అభినందనీయమని ఎంఎల్ఎ అన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు టేకుమూడి లక్ష్మణరావు, పొన్నమండ రామలక్ష్మి, వాడ్రేవు వీరబాబు, సత్య, వినోద్ రాజు, వేగేశ్న భాస్కర్ రాజు పాల్గొన్నారు.


కోనో కార్పస్ చెట్ల తొలగింపు పర్యవేక్షిస్తున్న కమిషనర్, డిఎఫ్ఒ

వేగంగా కోనోకార్పస్ చెట్ల తొలగింపు

ప్రజాశక్తి - కాకినాడ

పర్యావరణానికి, ప్రజారోగ్యానికి హాని కలిగించే కోనోకార్పస్ చెట్ల తొలగింపు ప్రక్రియ వేగవంతం చేసినట్లు కాకినాడ నగరపాలక సంస్థ కమిషనర్ జె.వెంకటరావు, డిఎఫ్ఒ ఎస్.భరణి తెలిపారు. కలెక్టర్ షాన్ మోహన్ ఇచ్చిన ఆదేశాలతో మంగళవారం జన్మభూమి పార్క్, బోట్ క్లబ్ పార్కులో కోనోకార్పస్ చెట్ల తొలగింపు ప్రక్రియను చేపట్టారు. చెట్ల తొలగింపు ప్రక్రియను వారు పరిశీలించారు. నగరంలోని వివిధ పార్కుల్లో సుమారు 500 కోనోకార్పస్ చెట్లు ఉండగా ఒక్క బోట్ క్లబ్ పార్క్‌లోనే 100 చెట్లు ఉండటంతో వాటిని తొలుతగా తొలగించేందుకు చర్యలు చేపట్టారు. ఈ సందర్భంగా తొలగించిన చెట్ల స్థానంలో టబూబియా బాటిల్ ఫ్రెష్, వెదురు వంటి మొక్కలను నాటే అంశంపై చర్చించారు. కళాశాలలు, పాఠశాలల్లో ఉన్న చెట్లను దశలవారీగా తొలగిస్తామన్నారు.

50 శాతం రాయితీపై చిరుధాన్యాల విత్తనాలు

ప్రజాశక్తి - గండేపల్లి

చిరుధాన్యాల సాగును పెంపుదల చేసే లక్ష్యంతో ప్రభుత్వం 50 శాతం రాయితీపై చిరుధాన్యాలు విత్తనాలను అందిస్తుందని వ్యవసాయ అధికారి సద్గురుమూర్తి తెలిపారు. మంగళవారం మండలం గోపాలపురం గ్రామంలో చిరుధాన్యాలు సాగుపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం చిరుధాన్యాలు సాగు విస్తీర్ణం పెంచాలని ప్రభుత్వం సంకల్పించిందని అన్నారు. 50 శాతం రాయితీపై విత్తనాలు అందజేసి, సాగు మెలకువలు పాటించేలా చూసి మళ్ళీ ప్రభుత్వం కొనుగోలు చేసే భరోసా ఇస్తోందన్నారు. మెరక, మూడు సంవత్సరాల వయసు లోపు పామాయిల్ తోటలలో రాగులు, కొర్రలు మొదలగు చిరుధాన్యాలు సాగుచేసి అధిక ఫలసాయం పొందవచ్చునని అన్నారు. అర్హులైన ప్రతి కౌలు రైతు కౌలు కార్డు పొంది ప్రభుత్వం రైతులకు అందించే సంక్షేమ పథకాలు ఉపయోగించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ రామాంజనేయులు, విఎఎ అలీషా, విహెచ్ఎ కనకయ్య, రైతులు పాల్గొన్నారు.

ఫిజియోథెరపీని సద్వినియోగం చేసుకోండి

ప్రజాశక్తి - పెద్దాపురం

స్థానిక మహాత్మా గాంధీ పాఠశాల ఆవరణలోని భవిత కేంద్రంలో వికలాంగ బాలలకు నిర్వహిస్తున్న ఫిజియోథెరపీని బాలల తల్లిదండ్రులు సద్వినియోగం చేసుకోవాలని ఎంఇఒలు ప్రభాకర శర్మ, చౌదరి సూచించారు. మంగళవారం ఫిజియోథెరపీ కేంద్రాన్ని వారు పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఫిజియోథెరపిస్ట్ డాక్టర్ బి.అపర్ణ, భవిత సిబ్బంది పి.దుర్గాప్రసాద్‌రెడ్డి, పి.ఆనందరావు పాల్గొన్నారు.

హుస్సేన్‌పురంలో డస్ట్ బిన్‌ల పంపిణీ

ప్రజాశక్తి - సామర్లకోట


ప్రజలకు డస్ట్‌బిన్స్‌ను అందిస్తున్న నాయకులు

మండలంలోని హుస్సేన్‌పురం గ్రామంలో ప్రజలకు డస్ట్ బిన్‌లు పంపిణీ చేశారు. గ్రామ నాయకులు బుజ్జి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో తడి చెత్త ,పొడి చెత్త వేయుటకు ప్రత్యేక డస్ట్ బిన్లను అందించి పరిసరాల పరిశుభ్రత, గ్రామంలో దోమలు పెరగకుండా, సీజనల్ వ్యాదులు ప్రభలకుండా ప్రజలు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి కర్రి శ్రీనివాస్, వెల్ఫేర్ అధికారి, గ్రామ నాయకులు పాల్గొన్నారు.

సమాచారంతో సమావేశాలకు హాజరవ్వాలి : నెహ్రూ

ప్రజాశక్తి - కిర్లంపూడి

మండల పరిషత్ సమావేశాలకు అధికారులంతా సమగ్ర సమాచారంతో హాజరుకావాలని ఎంఎల్ఎ జ్యోతుల నెహ్రూ అన్నారు. మంగళవారం మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో మండల సర్వసభ్య సమావేశం ఎంపిపి తోట రవి అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా మండలంలో వివిధ ప్రభుత్వ శాఖల వివరాలపై ఎంఎల్ఎ ఆరా తీశారు. ఈ సందర్భంగా ఎంఎల్ఎ జ్యోతుల మాట్లాడుతూ మండలంలోని ప్రతి శాఖకు చెందిన అధికారి తప్పనిసరిగా సర్వసభ్య సమావేశానికి హాజరయ్యేలా చూడాలని ఎంపిడిఒ రాజేశ్వరరావును ఆదేశించారు. సమావేశానికి హాజరయ్యే ప్రతి అధికారి రెండు రోజుల ముందు సమగ్రమైన సమాచారాన్ని ప్రతుల రూపంలో ప్రతి ఒక్క సభ్యునికి అందజేసి దానిపై సమగ్రంగా చర్చించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. మండలంలో ప్రస్తుతం ఉన్న రహదారుల పరిస్థితి, వాటిని పరిష్కరించేందుకు ఉన్న మార్గాలను సమగ్ర నివేదికతో అందజేయాలని నెహ్రూ రహదారుల శాఖ అధికారులను కోరారు. ప్రస్తుతం డయేరియా వ్యాపిస్తున్న తరుణంలో రూరల్ వాటర్ సప్లై మరియు పంచాయతీ మరియు వైద్య ఆరోగ్యశాఖ సమన్వయంతో ప్రతి వారం రోజులకు ఒకసారి వాటర్ ట్యాంకులను పరిశీలించి 15 రోజులకు ఒకసారి వాటిని శుభ్రపరచాలని ఆదేశించారు. తొలుత ఎంఎల్ఏగా ఎన్నికై తొలిసారిగా సమావేశానికి హాజరైన ఎంఎల్ఎకు ప్రజాప్రతినిధులు ఘనంగా స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో జడ్పిటిసి తోట గాంధీ, వైస్ ఎంపిపిలు, ఎంపిడిఒ రాజేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

మౌలిక సదుపాయాల మెరుగుకు చర్యలు

- జిల్లా కలెక్టర్ మహేష్‌కుమార్
- విద్యా, సమగ్ర శిక్ష అభియాన్ అధికారులతో సమావేశం

ప్రజాశక్తి-అమలాపురం


సమావేశంలో అధికారులతో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ మహేష్ కుమార్.

పాఠశాలల్లో మౌలిక సదుపాయాలు మెరుగుపరిచేందుకు చర్యలు చేపట్టాలని విద్యాశాఖ అధికారులను జిల్లా కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్ ఆదేశించారు. మంగళవారం స్థానిక కలెక్టరేట్లో జిల్లా కలెక్టర్ ఛాంబర్ నందు విద్యా, సమగ్ర శిక్ష అభియాన్ అధికారులతో సమావేశం నిర్వహించి విద్యా వ్యాప్తికై ప్రస్తుతం అమలు చేస్తున్న పథకాల అమలు తీరును ఆయన సమీక్షించారు. ఈ సంద ర్భంగా ఆయన మాట్లాడుతూ పాఠశాల ప్రాంగణాలలో ఉద్యాన, కృషి విజ్ఞాన కేంద్రాలసమన్వయంతో న్యూట్రిషన్ గార్డెన్స్ పెంపకానికి చర్యలు చేపట్టి, మధ్యాహ్న భోజన పథకంలో ఆయా ఉత్పత్తుల ద్వారా పోషకాహారాన్ని పిల్లలకు అందించాలని విద్యాశాఖ అధికారులను ఆదేశించారు. ఉన్నత చదువులకు తొలిమెట్టైన పదో తరగతి లో ఫెయిల్ అయిన విద్యా ర్థులు మరల సప్లమెంటరీ పరీక్షలకు హాజరయ్యేలా చర్యలు చేపట్టి ప్రతి ఒక్కరూ కనీస విద్యా ప్రమాణాలు అభ్యసించేలా అధికారులు ప్రత్యేక చొరవ చూపాలన్నారు. పాఠశాలల్లో మధ్యాహ్న భోజన పథకం గోరు ముద్ద అమలులో మెనూ తప్పని సరిగా పాటించాలని ఆదేశించారు. పాఠశాలల్లో సీజనల్ వ్యాధులు అనారోగ్యాల బారిన పడకుండా ఆర్ఒ వాటర్ ప్లాంట్ ద్వారా సురక్షిత తాగునీటిని అందించాలని ఆదేశించారు. మౌలిక స దు పా య ా లం కల్పనకు కూడా స్కూల్ మేనేజ్మెంట్ కమిటీల సహకారంతో కృషి చేయా లన్నారు. విద్యాహక్కు చట్ట ప్రకారం ప్రతి విద్యార్థి పాఠశాలల్లో విద్యను అభ్యసి ంచాల్సిన అవసరం ఉందన్నారు. బడి బయట ఉన్న పిల్లల్లో తరగతి తగ్గ కనీస సామ ర్థ్యాలు లేని పక్షంలో ప్రత్యామ్నాయ బడులు ఏర్పాటు చేసి ఆ తరగతికి దగ్గ సామర్థ్యాలు పెంపొందించి తదుపరి రెగ్యులర్ పాఠశాలల్లో చేర్పించాలని ఆదేశించారు. గ్రంథాల యాల ద్వారా మరింతగా పాఠ్యాంశాల పట్ల జనరల్ నాలెడ్జ్ పట్ల జ్ఞానాన్ని పెంపొందించుకునే విధంగా నిర్వహణ తీరు ఉండాలన్నారు. గుణాత్మకమైన నాణ్యమైన విద్యను అభ్యసింపజేసి ఫార్మేటివ్ సెమిస్టర్ పరీక్షలు సకాలంలో నిర్వహిస్తూ పబ్లిక్ బోర్డు పరీక్షల్లో మంచి ఉత్తీర్ణతా శాతాన్ని తీసుకుని వచ్చి జిల్లా ను విద్యాపరంగా ముందంజలో నిలపాలని సూచించారు. సమగ్ర శిక్ష అభియాన్ కార్యక్రమలపై సమీక్షిస్తూ ప్రత్యేక అవసరాలు గల చిన్నారులకు భవిత కేంద్రాల ద్వారా ఫిజియోథెరపి, వైద్య విధానాల ద్వారా వికలాంగత్వాన్ని అధిగమించి సకలాం గులుగా మారేందుకు చిత్తశుద్ధితో పాటుప డాలన్నారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు మంజూరు చేసిన నిధుల ద్వారా ల్యాబ్లు ఆట స్థలాలు వంటి మౌలిక సదుపాయా లు కల్పించి చదువుతోపాటు పరిశోధ నాత్మక విజ్ఞానం పెంపొందించి క్రీడా రంగంలో రాణించే విధంగా చర్యలు చేపట్టాలన్నారు. కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ అధికారి ఎం.కమలకుమారి, సమగ్ర శిక్ష అభియాన్ సహాయ ప్రొగ్రాం అధికారి మధుసూదన్‌రావు, జిల్లా సైన్స్ అధికారి సుబ్రహ్మణ్యం, సిఎంఒ, ఎఎంఒలు తదితరులు పాల్గొన్నారు.

12న రావులపాలెంలో ఉద్యోగ మేళా

ప్రజాశక్తి-ముమ్మిడివరం

రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ఈ నెల 12న రావులపాలెంలో ఉద్యోగ మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి పి.లోకమాన్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. రావులపాలెం లోని గోపాలపురం అవంతి ఫుడ్స్ కంపెనీలో సుమారు 90కి పైగా ఉద్యోగ అవకాశాలు ఉన్నాయని, జిల్లా వ్యాప్తంగా ఉన్న అర్హులైన నిరుద్యోగ యువతి, యువకులకు మేళాలో ఇంటర్వ్యూలు నిర్వహిస్తా రన్నారు. ఎస్ఎస్‌సి పాసై డిప్లమో, ఐటిఐ, మరియు ఏదైనా డిగ్రీ పాసైన లేదా ఫెయిల్ అయిన వారుకూడా అర్హులన్నారు. ఇంటర్వ్యూలకు బయోడేటా ఐడి అడ్రస్ ప్రూఫ్ పాస్ పోర్ట్ సైజ్ ఫోటోలు విద్యార్హత సర్టిఫికెట్లతో హాజరు కావాలన్నారు. ఇంటర్వ్యూలో సెలెక్ట్ అయిన అభ్యర్థులకు 15 రోజులపాటు శిక్షణ ఇస్తారని నైపుణ్యాభివృద్ధి అధికారి తెలిపారు. ఇతర వివరాలకు సెల్ నంబర్ 8247 645389ను సంప్రదించాలన్నారు.

పారిశుధ్యం అధ్వానం

ప్రజాశక్తి-అయినవిల్లి

మండలంలోని సిరిపల్లి పంచాయతీ పరిధిలోని చిల్లే వారి పేటను ఆనుకుని ఉన్న వీధి కాలువల్లో మురుగు, చెత్త చెదారం పేరుకుపోయింది. దీంతో పారిశుధ్యం అధ్వానం మారడంతో ప్రజలు నానా అవస్థలూ పడుతున్నారు. ఇటీవల కురిసిన వర్షాలకు మురుగునీరు ఎటూ దిగక ప్లాస్టిక్ బాటిళ్లు,కవర్లు, ఇతర చెత్తాచెదారం వీధికాలువల్లో పేరుకుపోయాయి. వీటిని రోజుల తరబడి తొలగించకుండా ఉంచడంతో దుర్వాసనతో ప్రజలు అవస్థలు పడుతున్నారు. వీధి కాలువల్లో పేరుకుపోయిన మురుగుతో దోమలు వృద్ధి చెందాయి. దీంతో అనేక మంది వ్యాధులు బారిన పడుతున్నారని స్థానికులు, కాలనీవాసులు వాపోతున్నారు. దీనిపై పంచాయతీకి, సంబంధిత అధికారులకు పలుమార్లు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని కాలనీ వాసులు ఆవేదన చెందుతున్నారు. పంచాయతీ అధికారులు తక్షణమే స్పందించి మురుగుకాలువలను శుభ్రం చేయాలన్నారు. అదేవిధంగా దోమల నిర్మూలనకు అధికారులు చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.


చిల్లేవారిపేట వద్ద వ్యర్థాలతో పూడుకుపోయిన వీధి కాలువ